

## పుస్తకావిష్కరణ

విశాఖ: రాచకొండ నరసింహశర్మ 101వ పుట్టినరోజు సందర్భంగా ఆయన రచించిన 'పంజరంలో పక్షి' కవితా సంపుటిని ఆవిష్కరించారు.



## అలరించిన నాటకం

విశాఖ: వీఎండీఏ వార్షికోత్సవంలో భాగంగా కళాభారతిలో ప్రదర్శించిన భక్తప్రహ్లాద నృత్యరూపకం అందరినీ అబ్బురపరిచింది.



## ఎరుకుమాంబకు జలాభిషేకం

విశాఖ: దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వయంగా జలాభిషేకం చేశారు. పసుపు రాసి హారతులు ఇచ్చారు.

## న్యూస్‌రీల్

### 9 మంది ఎస్‌ఐలకు స్థాన చలనం

సాక్షి , అనకాపల్లి : జిల్లాలో 9 మంది ఎస్‌ఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ దీపికా పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణదేవిపేట ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎం.ఉపేంద్రను యలమంచిలి రూరల్‌కు, అనకాపల్లి ఎస్పీ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐగా పనిచేస్తున్న కె.సావిత్రిని యలమంచిలి టౌన్‌కు, పరవాడలో పనిచేసే టి.మల్లేశ్వరరావును దేవరాపల్లికి, సబ్బవరం పీఎస్‌లో పనిచేసే ఆర్.ధనుంజయను కె.కోటపాడుకు, చీడికాడ ఎస్‌ఐ జి.నారాయణరావును వి.మాడుగులకు, అక్కడ పనిచేసే పి.దామోదరనాయుడును మాకవరపాలేనికి, పాయకరావుపేట ఎస్‌ఐగా పనిచేసే బి.జోగారావును చోడవరానికి, అనకాపల్లి సీఎంఎస్(కోర్టు మానిటరింగ్ సెల్) ఎస్‌ఐగా పనిచేస్తున్న పి.రామారావును గొలుగొండకు, నర్సీపట్నం రూరల్ ఎస్‌ఐ సీహెచ్.భీమరాజును నాతవరానికి బదిలీ చేశారు.

### దోస గింజలపై తెలుగు భాష గొప్పతనం



మాకవరపాలెం: తెలుగు భాష గొప్పతనాన్ని తూటిపాలకు చెందిన మైక్రో రైటర్ రవికుమార్ దోస గింజలపై లిఖించాడు. గురువారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా రవికుమార్ తెలుగు భాష మాధుర్యాన్ని దోస గింజలపై లిఖించి శుభాకాంక్షలు తెలియజేశాడు. దీనిని 171 దోస గింజలపై రాశానని వివరించాడు.

### విద్యార్థులకు ఆర్‌బీఐ క్విజ్ పోటీలు



ఆర్‌బీఐ ఆన్‌లైన్ క్విజ్ పోటీల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ చెప్పారు. కలెక్టరేట్‌లో ఆర్‌బీఐ క్విజ్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆమె ఆవిష్కరించారు. జిల్లాలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు https://www.rbi90quiz.in/ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఒక టీమ్‌గా ఏర్పడి రిజిస్టర్ చేసుకోవాలని, టీమ్‌లో కనీసం ఇద్దరు విద్యార్థులు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ పోటీలు మూడు విభాగాలుగా రాష్ట్రస్థాయి, జోనల్ స్థాయి, జాతీయ స్థాయిలో జరుగుతాయన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ మాట్లాడుతూ సెప్టెంబర్ 17 లోగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జాతీయ స్థాయి పోటీలో మొదటి బహుమతి రూ.10 లక్షలు, ద్వితీయం రూ.8 లక్షలు, తృతీయ బహుమతి రూ.6 లక్షలుగా ప్రకటించారు. జోనల్ స్థాయిలో మొదటి బహుమతిగా రూ.5 లక్షలు, ద్వితీయం రూ.4 లక్షలు, తృతీయం రూ.3 లక్షలు, రాష్ట్ర స్థాయి పోటీలో మొదటి బహుమతిగా రూ.2 లక్షలు, ద్వితీయం రూ.1.5 లక్షలు, తృతీయం రూ.లక్ష అందిస్తారు.

### ఎంపీపీగా లక్ష్మి బాధ్యతల స్వీకారం



ఎంపీపీ లక్ష్మికి శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మాకవరపాలెం: ఎంపీపీగా వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి బాధ్యతలు చేపట్టారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ గత నెల 31 న వ్యక్తిగత కారణాలతో ఎంపీపీ పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వైస్ ఎంపీపీ లక్ష్మిని ఎంపీపీగా నియమిస్తూ జిల్లా పరిషత్ నుంచి ఉత్తర్వులు అందాయి. దీంతో బుధవారం లక్ష్మి ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో సీతామహాలక్ష్మి, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, మాకవరపాలెం ఎంపీటీసీ సభ్యుడు సర్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నేతలు పెట్ల భద్రాచలం, మూకల బాలకృష్ణ, తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు, మండల పరిషత్ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## సీసీ కెమెరా నిఘా ఉండాలి



కోల్‌కతా ఘటన మానవతను మంట గలిపింది. ఒక్క వైద్య లోకమే కాదు యావత్ భారతావని కన్నెర్ర చేస్తోంది. ప్రతి ఆస్పత్రి ప్రాంగణాన్ని సీసీ కెమెరాల నిఘాలోకి తీసుకురావాలి. మహిళా వైద్య సిబ్బంది రక్షణ పట్ల ప్రభుత్వాలు శ్రద్ధ వహించాలి. వైద్యులెవరైనా ప్రాణాలు కాపాడడానికే తమ వృత్తి నైపుణ్యాన్ని ఉపయోగిస్తారు. ఈ సత్యాన్ని గుర్తెరిగి రోగుల బంధువులు సంయమనంతో నడుచుకోవాలి.

–డాక్టర్ వినయ్‌కుమార్, సూపరింటెండెంట్, చోడవరం సీహెచ్‌సీ



## రక్షణ కల్పించాలి

గ్రామాల్లో విధులు నిర్వహించే వారికి రక్షణ లేదు. వైద్యం అందించే సమయంలో మందుబాబులు వచ్చినప్పుడు వారితో ఘర్షణలు జరుగుతున్నాయి. భద్రత కోసం ప్రత్యేక సిబ్బందిని కేటాయించకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. తగిన రక్షణ ఉన్నప్పుడే వైద్యసిబ్బంది భయం లేకుండా పనిచేయగలుగుతారు. లేకుంటే పనిపై ప్రభావం చూపిస్తుంది. ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి.

–పి.రాజేశ్వరి, పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి, ఎస్.రాయవరం మండలం



- చోడవరం రూరల్/ఎస్.రాయవరం



"కె.కోటపాడు మండలం ఎ.కోడూరు గ్రామానికి చెందిన రైతు లెక్కల కోటేశ్వరరావు సేంద్రియ విధానంలో డ్రాగన్ ఫ్రూట్‌ను పండిస్తున్నారు. చదువులో పట్టభద్రుడైనా వ్యవసాయంపై ఆసక్తితో తన మూడున్నర ఎకరాల భూమిలో ఈ డ్రాగన్ ఫ్రూట్ సాగు చేపట్టారు. గుంటూరు, శ్రీకాకుళం, విజయవాడ ప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్ పంటను ఆయన అక్కడకు వెళ్లి పరిశీలించారు. గుంటూరు, విజయనగరం జిల్లా కిత్తనపేట ప్రాంతాల నుంచి డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను తీసుకువచ్చి తన పొలంలో 2022 జనవరిలో నాటారు. ట్రెల్లీస్, డబుల్ ట్రెల్లీస్ విధానంలో సాగు చేపట్టగా మొదటి, రెండో ఏడాది దిగుబడి 15 టన్నుల వరకూ వచ్చింది. మార్కెట్‌లో పంటకు మంచి ధర ఉండడంతో సాగు లాభదాయకంగా ఉందని చెబుతున్నారు."

• డ్రాగన్ ఫ్రూట్ ఫుల్

# చిగురు తొడిగిన ఎడారి మొక్క

- సేంద్రియ పద్ధతిలో సాగు
- ఉష్ణోగ్రతలను తట్టుకునేలా చైనా క్లే పిచికారి
- ఎకరాకు రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల పెట్టుబడి
- ఏడాదిన్నరలో రెండు విడతల్లో 15 టన్నుల దిగుబడి
- దేవరాపల్లి, కె.కోటపాడు రైతులకు వరంలా ఎడారి మొక్క



గుట్టలుగా డ్రాగన్ ఫ్రూట్స్

సాక్షి, అనకాపల్లి : జిల్లాలో వర్షాధార భూముల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు సిరులు కురిపిస్తోంది. సంప్రదాయ పంటల కంటే డ్రాగన్ ఫ్రూట్ లాభదాయకంగా ఉండడంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఏజెన్సీ కన్నా మిన్నగా మైదాన ప్రాంతంలో కూడా ఈ పంటను సాగు చేస్తున్నారు. జిల్లాలో సైతం క్రమేపీ సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఉష్ణజాతికి చెందిన (ఎడారి మొక్క) డ్రాగన్ ఫ్రూట్ తక్కువ వర్షపాతం ఉండే ప్రాంతాల్లోనూ బాగా దిగుబడి ఇస్తుంది. అధిక పోషక విలువలు ఉండడంతో డ్రాగన్ ఫ్రూట్‌కు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఈ పండు కేజీ ధర నాణ్యతను బట్టి రూ. 150 నుంచి రూ.200 వరకు పలుకుతుంది. దీంతో రైతులు దీని సాగుపై మక్కువ చూపుతున్నారు.

**జిల్లాలో 20 ఎకరాల్లో...**

జిల్లాలో సుమారు 20 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్‌ను రైతులు సాగు చేస్తున్నారు. వీటిలో వైట్, రెడ్ రకాలు ఉన్నాయి. సాగు చేసిన ఏడాది తర్వాత నుంచి పంట ప్రారంభమై ఏకధాటిగా 25 ఏళ్ల వరకు దిగుబడి ఇస్తుంది. ప్రతి ఏటా దిగుబడి పెరుగుతూనే ఉంటుంది. సేంద్రియ ఎరువులతో సాగు చేస్తే మరింత దిగుబడి వస్తుంది. ఈ పంటలకు తెగుళ్ల బెడద తక్కువ. ప్రతి ఏటా జూన్ నుంచి అక్టోబర్ మధ్య పండు దిగుబడి వస్తుంది. అనకాపల్లి జిల్లాలో దేవరాపల్లి, కె.కోటపాడు, మాడుగుల, చీడికాడ, కోటవురట్ల, మాకవరపాలెం, రావికమతం మండలాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగులో ఉంది.



డబుల్ ట్రెల్లీస్ విధానంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు

**సాగు చేసే విధానం ఇలా......**

త్వరగా ఎత్తు పెరిగే డ్రాగన్ ఫ్రూట్ మొక్కకు నిటారుగా ఎదగడానికి సిమెంట్ కాంక్రీట్ స్తంభాలను సపోర్ట్‌గా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ స్తంభాలపైన మొక్కలు అల్లుకునేందుకు వీలుగా గుండ్రటి, చతురస్రాకారంతో గొడుగుల్లా మొక్కలు పెరిగేలా సిమెంట్ నిర్మాణాలు ఏర్పాటు చేయాలి. ఏడు అడుగుల సిమెంట్ స్తంభాలను తీసుకొని రెండు అడుగుల లోతు భూమిలో పాతాలి. ఎకరాకు 450 నుండి 500 వరకు స్తంభాలు ఏర్పాటు చేసి 1800 నుంచి 2 వేల వరకు మొక్కలు నాటాలి. సాగుకు తొలి ఏడాది మాత్రమే ఖర్చు ఉంటుంది. ఎకరాకు 4 నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతుంది.

**గుండెకు ఆరోగ్యం.....**

డ్రాగన్ ఫ్రూట్‌ను తరుచూ తినడం ద్వారా గుండె సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండడంతో పాటు గుండె జబ్బులు రాకుండా నివారిస్తుంది. క్యాన్సర్, సుగర్ తదితర దీర్ఘ కాలిక వ్యాధులు రాకుండా నివారిస్తుంది. మంచి కొలెస్ట్రాల్‌ను, రోగ నిరోధక శక్తిని పెంచి ఇన్‌ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది.

### అధిక పోషక విలువలు

మంచి రుచితో పాటు అధిక పోషక విలువలు కలిగి ఉండడం డ్రాగన్ ఫ్రూట్ ప్రత్యేకత. పోషకాల స్టోర్ హౌస్‌గా పిలిచే డ్రాగన్ పండు ధర అధికంగా ఉన్నప్పటికీ కొనుగోలుదారుల నుంచి డిమాండ్ ఉంటుంది. శరీరానికి శక్తినిచ్చే ఫైబర్, ప్రొటీన్లతో పాటు మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, ఫాస్పరస్ వంటి మినరల్స్ మెండుగా ఉన్నాయి. విటమిన్ సి, బి1, బి2, బి3 విటమిన్లు సైతం అధికంగా ఉన్నాయి.

## పెళ్లి వేడుకలో రక్తదాన ప్రచారం

- నూతన జంట ఆదర్శం



పెళ్లి మండపంలో రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రచారం చేస్తున్న నూతన దంపతులు

బుచ్చెయ్యపేట: పెళ్లంటే నూరేళ్ల పంట. పెళ్లి రోజు క్షణం తీరిక లేకుండా ఉంటుంది. కానీ ఈ నూతన వధూవరులు మాత్రం తమ పెండ్లికొచ్చిన వందలాది మందికి రక్తదానంపై అవగాహన కల్పించి, ఆదర్శంగా నిలిచారు. విశాఖకు చెందిన యువకుడు వైకుంఠరావు గాజువాక స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తున్నారు. పలు రక్తదాన శిబిరాల్లో పాల్గొనడమే కాక సేవా కార్యక్రమాలు చేస్తుంటారు. బుధవారం విశాఖ ఎస్ఎస్‌టీఎల్ వద్ద కల్యాణ మండపంలో తన వివాహం జరిగింది. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకుని బుచ్చెయ్యపేట మండలం మేజర్ పంచాయతీ వడ్డాదిలో అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సంస్థ వెయ్యి మందితో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలుసుకున్నారు. వడ్డాది యువకులకు ఫోన్ చేసి ముందుగానే రక్తదాన శిబిరం వాల్ పోస్టర్లను తెప్పించుకున్నారు. నూతన వధువు నీరజతో కలిసి కల్యాణ మండపంలో రక్తదానంపై అవగాహన కల్పించారు. రక్తదాన గోడ పత్రికను ఆవిష్కరించి మనం రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారికి ప్రాణం పోస్తామని, రక్తదానంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. వడ్డాదిలో జరిగే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని పెళ్లికొచ్చిన అతిథులకు అరగంట సేపు అవగాహన కల్పించారు. వారి సంకల్పాన్ని పలువురు ఆశీర్వదించి, అభినందించారు.

# మత్తును చిత్తు చేసేలా..



యలమంచిలి వైఎస్సార్ కూడలి వద్ద విద్యార్థుల మానవహారం

- యలమంచిలిలో విద్యార్థి సంఘాల భారీ ప్రదర్శన
- డ్రగ్స్ నిరోధంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమని విమర్శ



డ్రగ్స్ వినియోగం, రవాణాకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

యలమంచిలి రూరల్: డ్రగ్స్ నిరోధించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. బుధవారం పట్టణంలో ప్రధాన రహదారిపై ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల నేతృత్వంలో విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగం, రవాణాకు వ్యతిరేకంగా ర్యాలీ చేపట్టారు. డ్రగ్స్ వినియోగం వద్దంటూ బ్యానర్లు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ ప్రధాన రహదారిపై మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.రమణ, చింతకాయల శివాజీ మాట్లాడుతూ యువత, విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడి తమ జీవితాలను అంధకారం చేసుకుంటున్నారన్నారు. ఆ మత్తులో నేరాలకు పాల్పడుతున్న వారు కూడా ఉన్నారన్నారు. డ్రగ్స్ మహమ్మారి సమాజంలో పూర్తిగా వేళ్లూనుకోకముందే ప్రభుత్వాలు వీటిని పూర్తిగా నియంత్రించడానికి చిత్తశుద్ధితో స్పష్టమైన కార్యాచరణ రూపొందించి అమలు చేయాలన్నారు. అధికారంలో ఉన్న పార్టీల నాయకులు మాదకద్రవ్యాలను అరికడతామని చెబుతున్నప్పటికీ వారి ప్రకటనలు ఆచరణలోకి రాకపోవడం వలన యువత మత్తు బారిన పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. యలమంచిలి పట్టణంలో విచ్చలవిడిగా గంజాయి లభ్యమౌతోందని, విద్యార్థులు మత్తుకు బానిసలవుతున్నారన్నారు. మారుమూల గ్రామాలకు సైతం గంజాయి సరఫరా జరుగుతోందన్నారు. డ్రగ్స్, గంజాయి రవాణా వినియోగంపై తక్షణమే ప్రభుత్వాలు స్పందించి చేయి దాటక ముందే మేల్కోవాలని వారు హితవు పలికారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాలన్నీ ఐక్యంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మైలపల్లి బాలాజీ, కేశవ, శ్రీను, మణికంఠ, కృప, వివిధ కాలేజీలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

## సీబీఆర్ఎన్ ఏర్పాటుకు చర్యలు వేగవంతం



విమ్స్‌లో పరిశీలిస్తున్న కేంద్ర ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ అనురాధ

ఆరిలోవ (విశాఖ): విమ్స్‌లో సెకండరీ లెవెల్ కెమికల్ బయోలాజికల్ రేడియోలాజికల్ అండ్ న్యూక్లియర్(సీబీఆర్ఎన్) మెడికల్ మేనేజ్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం వేగవంతమైన చర్యలు చేపట్టినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.అనురాధ తెలిపారు. కేంద్ర ఆరోగ్యశాఖ కమిటీ సభ్యులతో కలిసి ఆమె బుధవారం విమ్స్‌ను సందర్శించారు. విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, వైద్యులతో కలిసి సీబీఆర్ఎన్ సెంటర్ నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో పరిసరాలు అనుకూలంగా ఉన్నాయంటూ సంతృప్తి వ్యక్తం చేశారు. సీబీఆర్ఎన్ సెంటర్ ఏర్పాటుకు త్వరలో రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంటామన్నారు. ఈ పరిశీలనకు సంబంధించిన రిపోర్టు తయారు చేసి నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. కన్సల్టెంట్ ప్రదీప్‌రెడ్డి, సచిన్ మహింద్రో, స్టేట్ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ అండ్ వెల్ఫేర్ ఎస్ఎస్‌టి డాక్టర్ మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

### బెంగళూరులో అనకాపల్లి వాసి అవయవదానం

అనకాపల్లి:

బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవాలను అతని కుటుంబ సభ్యులు దానం చేశారు. కాపుశెట్టివానిపాలెం గ్రామానికి చెందిన సాధుబాబు (35) కొద్దిరోజుల క్రితం బెంగళూరులోని స్నేహితుల వద్దకు వెళ్లాడు. అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన బ్రెయిన్ డెడ్ అయింది. ఆయన చికిత్స పొందుతున్న మణిపాల్ ఆస్పత్రి వర్గాలు సాధుబాబు కుటుంబ సభ్యులను అవయవదానానికి ఒప్పించారు. దీంతో ఆయన శరీరం నుంచి సేకరించిన అవయవాలను వివిధ ఆస్పత్రుల్లో అవసరమైన వారికి పంపించారు.

## రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు

చోడవరం: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 32 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 31నుంచి తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు వీరంతా జిల్లా నుంచి పాల్గొంటారని తైక్వాండో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళి తెలిపారు. అదేవిధంగా ఉమెన్స్ లీగ్ పోటీలు కూడా అదే తేదీల్లో తిరుపతిలో జరగనున్నాయన్నారు. ఈనెల 27వ తేదీన గాజువాకలో జరిగిన జిల్లాస్థాయి కాడెట్ క్యొరుగి, పూమ్‌సే జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పతకాలు సాధించిన వారిని రాష్ట్ర స్థాయిలో ఆడేందుకు ఎంపిక చేశారు. ఈ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి చోడవరం, అనకాపల్లి, గాజువాక ప్రాంతాలకు చెందిన తైక్వాండో క్రీడాకారులు బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. ఉమెన్స్ లీగ్‌పోటీలకు జిల్లా నుంచి వి.జెస్సిక రోజీలీ, ఎం.హేమశ్రీ, ఎ.భరణి, షేక్ వహదా బషీర్, డి.దివ్య, ఎం.సంతోషి, కె.లావణ్య, జి.సంగీతలక్ష్మి ఎంపికయ్యారని చెప్పారు. వీరు ఉమ్మడి జిల్లా నుంచి త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడేందుకు ఎంపికైనట్టు మురళి తెలిపారు.

# 'కూటమి'లో ఇసుక దుమారం

- రెండు వర్గాల పరస్పర ఫిర్యాదులతో బయటపడుతున్న అక్రమాలు
- మరో రెండు టిప్పర్లను పట్టుకున్న పోలీసులు
- ప్రజాప్రతినిధి వద్ద పంచాయతీ.. జోక్యం చేసుకోనని చేతులెత్తేసిన వైనం



డీఎల్ పురం నుంచి ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న టిప్పర్లు

నక్కపల్లి: కూటమి పార్టీల మధ్య ఆధిపత్య పోరు కారణంగా అనేక ఇసుక అక్రమాలు బయటకు వస్తున్నాయి. ఇసుక అక్రమ తవ్వకాలను, రవాణాను అరికట్టడంలో అధికార యంత్రాంగం డొల్లతనాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. టీడీపీ, జనసేన వర్గాల పరస్పర ఫిర్యాదులతో రేగిన దుమారం హాట్ టాపిక్‌గా మారింది. వారం రోజుల క్రితం ఒక వర్గానికి చెందిన నాయకులు మరో వర్గానికి చెందిన ఇసుక టిప్పర్లను పట్టించారు. ఈ పంచాయతీ స్థానిక ప్రజాప్రతినిధి వరకు వెళ్లింది. ఇరు వర్గాలకు సర్దిచెప్పలేక ఇందులో తాను తల దూర్చలేనని, పట్టుకున్న వాహనాలను వదిలేయమని చెప్పడం భావ్యం కాదంటూ సదరు నేత తప్పించుకున్నారు.

దీంతో బుధవారం మరో వర్గానికి చెందిన రెండు టిప్పర్లను ఇవతలి వర్గం వారు పట్టించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా ఈ అక్రమాలు ఏపీఐఐసీ అధికారులు, మైనింగ్ ,స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుల కంట పడకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వంలో ఇసుక దోపిడీ చేశారంటూ ప్రతిరోజు విమర్శలు గుప్పించిన హోం మంత్రి అనిత ఇలాకాలోనే ఈ ఇసుక దందాలు జరగడం గమనార్హం.

**ప్రభుత్వ పెద్దల సహకారం**

డీఎల్ పురం సమీప ప్రాంతాల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. రూ.60 వేలు విలువ చేసే (సుమారు 50 టన్నులు) ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారని అందిన సమాచారం మేరకు పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. సముద్ర తీరప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు ఇటు మైనింగ్, అటు రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులకు సవాల్‌గా మారాయి. పోలీసు దాడులను సైతం ఇసుక మాఫియా బేఖాతరు చేస్తోంది. వారికి ప్రభుత్వ పెద్దల సహకారం ఉండడమే అందుకు కారణమని తెలుస్తోంది.

డీఎల్ పురం, అమలాపురం, వేంపాడు పంచాయతీల పరిధిలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లోనే ఈ ఇసుక తవ్వకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పరిహారం చెల్లించి స్వాధీనం చేసుకోని భూములపై మాఫియా కళ్లు పడి ఇసుకను దోచేస్తున్నారు.

**ఇసుక కల్తీతో లాభం రెండు రెట్లు అధికం**

అక్రమంగా తరలించిన సముద్రపు ఇసుకను ప్రభుత్వం డిపోల్లో విక్రయిస్తున్న నాణ్యమైన ఇసుకలో కలిపి విక్రయిస్తున్నారు. ఇలా చేయడం వల్ల మాఫియాకు రెండు రెట్లు అదనంగా లాభం వస్తోంది. ఒక లారీ నది ఇసుకలో రెండు లారీల సముద్రపు ఇసుకను కలిపి విక్రయిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డిపోలో కొనుగోలు చేసిన 30 టన్నుల ఇసుక ధర రూ.32 వేలు ఉంటే దీంట్లో రెండు లారీల సముద్రపు ఇసుకను కలిపి విక్రయిస్తే లక్ష రూపాయల లాభం వస్తోంది. టిప్పర్లను పట్టుకున్న వ్యవహారంపై నక్కపల్లి సీఐ కుమారస్వామి మాట్లాడుతూ డీఎల్ పురం వద్ద సముద్రపు ఇసుకను తరలిస్తున్నట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. ఎస్ఐ సన్నిబాబును, సిబ్బందిని పంపించి దాడులు చేయగా రెండు టిప్పర్లలో తరలిస్తున్న ఇసుక దొరికిందన్నారు. ఇసుక తవ్వేందుకు ఉపయోగించే పొక్లెయిన్‌ను స్టేషన్‌కు తరలించి, పెనాల్టీ విధించేందుకు తహసీల్దార్‌కు సిఫార్సు చేశామన్నారు.

## క్లుప్తంగా

### సబ్ జైలులో సౌకర్యాలపై ఆరా



సబ్‌జైల్‌ను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షీయాజ్ ఖాన్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రోహిత్

నర్సీపట్నం: సబ్ జైల్‌ను బుధవారం సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షీయాజ్ ఖాన్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిత్ సందర్శించారు. జైలులో వసతులపై ఆరా తీశారు. ఖైదీలకు అందిస్తున్న నిత్యావసర సరకులను పరిశీలించారు. అనంతరం ఖైదీలతో సమావేశమై సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని ప్రశ్నించారు. ఖైదీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బెయిల్ పెట్టుకునేందుకు ఆర్థిక స్తోమత లేని వారికి మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా న్యాయవాదిని నియమిస్తామని సీనియర్ సివిల్ జడ్జి తెలిపారు. అటువంటి వారు ఉంటే వివరాలను జైలు సూపరింటెండెంట్‌కు ఇవ్వాలని సూచించారు.



### సంయమనం పాటిస్తేనే మెరుగైన వైద్యం

వైద్య సేవల కోసం ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు సంయమనం పాటించాలి. కాస్త సమయం వేచి ఉండాల్సి వస్తే రోగుల బంధువులు వైద్య సిబ్బందితో వాగ్వాదానికి దిగిన సందర్భాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. మెరుగైన వైద్యం అందించాలన్న మంచి సదుద్దేశ్యంతో ఉన్న వైద్య సిబ్బందికి ఇటువంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఆస్పత్రుల్లో వైద్య సిబ్బందికి ప్రభుత్వం భద్రత కల్పించాలి.

– డి.సాయికిరణ్, వైద్యాధికారి, లంకవానిపాలెం పీహెచ్‌సీ, కె.కోటపాడు మండలం



### కోల్‌కతా ఘటన బాధాకరం



గతంలో వైద్యులను దేవుడిగా పూజించేవారు. నేటి సమాజంలో వైద్యులకు తగిన గుర్తింపు లభించడం లేదు. మనిషి ప్రాణాలను రక్షించే వైద్యులపై దాడులు పెరిగిపోయాయి. కోల్‌కతా సంఘటన చాలా బాధాకరమైన విషయం. అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మృతి చెందిన జూనియర్ వైద్యురాలి ఆత్మశాంతి కలగాలంటే నిందితులకు కఠిన శిక్ష పడాలి.

– సత్యవతి, ఎంఎల్‌హెచ్‌పీ, శంకరంగ్రామం, అనకాపల్లి జిల్లా

– అనకాపల్లి/కె.కోటపాడు

# సింహగిరిపై సందడిగా ఉట్ల సంబరం



శ్రీకృష్ణాలంకారంలో అప్పన్న ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి



ఉట్టిని అందుకుంటున్న యాదవుడు

సింహాచలం: శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం సింహగిరిపై ఉట్ల సంబరాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని శ్రీకృష్ణుడిగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా డోలీలో ఉంచి ఆలయ రాజగోపురం వద్ద అధిష్ఠింపజేశారు. రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేసిన ఉట్టిని యాదవులు అందుకోవడానికి ప్రయత్నించగా.. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తాడు లాగుతూ సందడి చేశారు. అనంతరం స్వామికి వెన్న, పాలు నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. భక్తులు ఉట్ల సంబరాన్ని తిలకించి స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఉత్సవంలో పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# బదిలీలు.. పైరవీలు!

- మరో 2 రోజుల్లో ముగియనున్న ఉద్యోగుల బదిలీ గడువు
- పలు శాఖల్లో బదిలీలకు ప్రత్యేక రేటు, రూ.లక్షల్లో బేరసారాలు
- మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ అధికారుల ప్రదక్షిణలు
- ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలతోనే బదిలీల పర్వం



మహారాణిపేట(విశాఖ): కోరుకున్న చోటకు బదిలీ కావాలంటే సిఫార్సు లెటరే మంత్రదండం. ఈ చేతిలో కట్టలు పెట్టు.. ఆ చేత్తో లెటర్ పట్టు అంటూ ప్రజాప్రతినిధులు ఇచ్చిన బంపర్ ఆఫర్‌తో ఉద్యోగులు సిఫార్సు లేఖలతో కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. సార్.. ఫలానా చోటకు నాకు బదిలీ కావాలి అని లెటర్ పెడుతూ దానికి ప్రజాప్రతినిధి ఇచ్చిన లెటర్‌ను జతపరుస్తున్నారు. ఇలా జిల్లాలో అక్రమ బదిలీలు, పైరవీలకు ప్రజా ప్రతినిధులు తెరలేపారు. మరో రెండు రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల గడువు పూర్తి కానుండడంతో పైరవీలు జోరుగా సాగుతున్నాయి.

**నిబంధనలన్నీ కాగితాలకే..**

జిల్లాలో 14 ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులకు సాధారణ బదిలీలు చేపడుతున్నారు. ఈ ఏడాది జూలై 31 నాటికి ఒకే దగ్గర ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి తప్పనిసరిగా స్థాన చలనం కల్పిస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు మించి పనిచేసిన వారికి, 40 శాతానికి మించి వైకల్యం ఉద్యోగులకు ధ్రువీకరణ పత్రం అందిస్తే బదిలీల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిబంధనలు విధించింది. ఐటీడీఏ, మన్యం ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టుల భర్తీ తర్వాత మిగిలిన ప్రాంతాల్లో పోస్టులను భర్తీ చేయాలన్న నిబంధన పెట్టారు. అయితే బదిలీల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎంటరైన తర్వాత నిబంధనలన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి.

**రెవెన్యూలో 60 సిఫార్సులు లేఖలు.!**

రెవెన్యూ శాఖలో అన్ని కేడర్లలో కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ బదిలీలు చేయాల్సి ఉంటుంది. అల్లూరి జిల్లా కలెక్టర్, అనకాపల్లి జిల్లా కలెక్టర్లతో సంప్రదింపులు జరిపిన తర్వాత ట్రాన్స్‌ఫర్స్ చేయనున్నారు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్, తహసీల్దార్ కార్యాలయం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్స్, ఇతర కేడర్ల బదిలీలపై తుదిగా విశాఖ కలెక్టర్ సంతకం చేస్తారు. ఈ కారణంతో కలెక్టర్ కార్యాలయానికి 60 సిఫార్సులు లేఖలు వచ్చినట్టు తెలిసింది. మంత్రులు, ఎమ్మెల్యేల నుంచి ఈ లేఖల్ని కొందరు ఉద్యోగులు తీసుకొచ్చినట్లు సమాచారం. వీటితో పాటు వివిధ కేడర్ల ఉద్యోగుల నుంచి కూడా రిక్వెస్ట్ లెటర్లు కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నాయి.

**ఈ సాయంత్రం కొలిక్కి..!**

నగరంలో గురువారం ఆర్థిక సదస్సు జరగనుంది. ఈ సదస్సు తర్వాత మూడు జిల్లాల కలెక్టర్లు సమావేశమై బదిలీలను కొలిక్కి తీసుకొచ్చే అవకాశం ఉంది. విశాఖ జిల్లాలో పోస్టింగ్ కోసం ఇప్పటికే 15 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పనిచేస్తున్న అనేక మంది తహసీల్దార్లు విశాఖ జిల్లాలో పనిచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మంచి పోస్టుల కోసం తహసీల్దార్లు ఎమ్మెల్యే సిఫార్సుల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

**ఇతర విభాగాల్లోనూ..**

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా విభాగంలో బదిలీల పర్వం మొదలైంది. ఈఈలు, డీఈలు, ఇతర సిబ్బంది బదిలీ కోసం చీఫ్ ఇంజినీర్లు కౌన్సెలింగ్ నిర్వహిస్తూ ఉద్యోగుల వివరాలు సేకరించారు. జాబితాలు సిద్ధం చేశారు. ఈ బదిలీలను సంబంధిత శాఖల ఈఎన్‌సీకి ఇస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ బదిలీల్లో కూడా మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులు భారీగా ఉన్నట్లు తెలుస్తోంది. పంచాయతీరాజ్‌లో కీలకమైన జెడ్పీ సీఈవో పోస్టు ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేసిన జెడ్పీ సీఈవో ఒక మంత్రి వద్ద పనిచేసేందుకు సిద్ధమవుతున్నారు. ఎంపీడీవో పోస్టుల్లోనూ పైరవీలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎమ్మెల్యేలను మచ్చిక చేసుకొని నచ్చినచోట వెళ్లడానికి కొంత మంది అధికారులు నానా ప్రయత్నాలు చేస్తున్నారు. డ్వామా, పర్యాటక శాఖ, బీసీ, ఎస్సీ, సాంఘిక సంక్షేమ శాఖల్లో పోస్టులు కోసం భారీగా పైరవీలు జరుగుతున్నాయి. మొత్తంగా బదిలీల జాతర కూటమి నేతలకు కాసుల వర్షం కురిపిస్తోంది.



# ఆర్థిక సదస్సుకు పక్కా ఏర్పాట్లు



ఏర్పాట్లను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంత రాముకు వివరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట(విశాఖ): విశాఖ వేదికగా గురువారం జరగనున్న సర్క్యులర్ ఎకానమి పాలసీ అమలుపై జాతీయ స్థాయి వర్క్‌షాప్‌నకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం నోవాటెల్‌లో జేసీ కె.మయూర్ అశోక్‌తో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో సెమినార్ నిర్వహణ, ఇతర కార్యకలాపాలపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(పర్యావరణం, అటవీ, సైన్స్–టెక్నాలజీ) అనంత రాము అధికారులకు కొన్ని సూచనలు చేశారు. అందరూ సమన్వయంతో వ్యవహరించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సెమినార్‌లో వివిధ రంగాల నిపుణులు, సంస్థల ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు సుమారు 150 మంది భాగస్వామ్యమవుతారని వెల్లడించారు. సదస్సు నోవాటెల్ హోటల్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని తెలిపారు. సదస్సుకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ కార్యదర్శి లీనా నందన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నరేష్ పాల్ గంగ్వార్, రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనంతరాము హాజరుకానున్నారు.

# సంస్కృతి శరీరమైతే.. భాష ప్రాణం

- శతావధాని తాతా సందీప్‌శర్మ
- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



గిడుగు రామమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సందీప్‌శర్మ

పాయకరావుపేట: సంస్కృతి మన శరీరమైతే.. భాష మన ప్రాణమని, ఈ రెండు కలిసి ఉన్నప్పుడే పరస్పరం నిలబడతాయని ప్రముఖ ప్రవచన కర్త, శతావధాని తాతా సందీప్‌శర్మ అన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థలో గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషలో ఎంతో గొప్ప సాహిత్యం ఉందన్నారు. తెలుగు భాషకే సొంతమైన ప్రత్యేక ప్రక్రియ అవధానమన్నారు. గణితం, సైన్స్ రెండింటిని కూడా పద్యాలలో రాసిన ఘనత మన తెలుగు కవులదేనని ఆయన స్పష్టం చేశారు. పుస్తక పఠనంతో అపారమైన జ్ఞానాన్ని సాధించవచ్చని, అదే సెల్‌ఫోన్‌ను వినియోగిస్తే కాలాన్ని వృథా చేసుకోవడమేనని హెచ్చరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నృత్య రూపకం అందరినీ మంత్రముగ్ధులను చేసింది. కథలు చెప్పడం, బాల గేయాలు, వ్యాస రచన, ఏకపాత్రాభినయం, సుమతి, భాస్కర శతక పద్యాల పోటీలు, వక్తృత్వం, రామాయణంపై క్విజ్, తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు సందీప్ శర్మ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు కె.ఆర్.జె.శర్మ, విద్యా సంస్థల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



## కేజీహెచ్‌లో 'మంకీపాక్స్' వార్డు



కేజీహెచ్‌లో సిద్ధం చేసిన ప్రత్యేక వార్డు

మహారాణిపేట (విశాఖ): మంకీపాక్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల మేరకు కేజీహెచ్‌లో అధికారులు ప్రత్యేక వార్డును సిద్ధం చేశారు. క్యాజువల్టీ మేడపై ఉన్న ఐసోలేషన్ వార్డులో 20 పడకలతో వార్డును ఏర్పాటు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. వ్యాధి నిర్ధారణ, చికిత్స కోసం జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ డి.రాధాకృష్ణ, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.రత్నకుమారి, డెర్మటాలజీ విభాగాధిపతి డాక్టర్ టి.శాంతి, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఎ.కృష్ణవేణితో కూడిన కమిటీని నియమించారు.

## శారదా నదిలో పడి వృద్ధురాలు మృతి

అనకాపల్లి: స్థానిక శారదానదిలో వేటజంగాలపాలెం గ్రామానికి చెందిన మడక పైడమ్మ (60) ప్రమాదవశాత్తూ కాలుజారి పడిపోయినట్లు పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్‌ఐ సత్యనారాయణ కథనం మేరకు... మతిస్థిమితం లేకపోవడంతో పైడమ్మకు విశాఖ మెంటల్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆమె ప్రస్తుతం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయి ఇంట్లోనే ఉంటున్నారు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శారదానదికి వెళ్లి నీట మునిగి మరణించినట్టు ఆమె పెద్ద కుమారుడు మడక తాతారావు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

## పాత నేరస్తుడికి జైలు శిక్ష, జరిమానా

పరవాడ: పగటి పూట ఇంటిలో ఎవరూ లేని సమయంలో పలు దొంగతనాలకు పాల్పడి, పట్టుబడిన నిందితుడు పిళ్లా నూకరాజు నేరం రుజువు కావడంతో 8 నెలల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ అనకాపల్లి జిల్లా 11వ అదనపు మెజిస్ట్రేట్ ఎ.రమేష్ బుధవారం తీర్పు వెలువరించినట్లు పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన నూకరాజు పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంత్రిపాలెంలో దొంగతనం చేస్తూ పట్టుబడిన కేసులో ఈ ఏడాది ఏప్రిల్ 1న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం పబ్లిక్ ప్రాసిక్యూటర్ మృణాళిని వాదనల్ని ఏకీభవిస్తూ నేరం రుజువైనందున మెజిస్ట్రేట్ రమేష్ పై విధంగా తీర్పు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

## వాడనర్సాపురంలో పల్సర్ బైక్ దగ్ధం

- పెట్రోల్ పోసి నిప్పటించిన గుర్తు తెలియని దుండగులు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు, క్లూస్ టీం



దగ్ధమైన ద్విచక్ర వాహనాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, క్లూస్ టీం సభ్యులు

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం వాడనర్సాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త చింతకాయల ముత్యాలరావుకు చెందిన పల్సర్ బైక్‌కు మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. రాంబిల్లి సీఐ సిహెచ్.నర్సింగరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ముత్యాలరావు తన బైక్‌ను ఇంటి వద్ద రాత్రి పార్కింగ్ చేసి నిద్రపోయారు. అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు పెట్రోల్ పోసి నిప్పు అంటించడంతో బైక్ పూర్తిగా దగ్ధమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం మధ్యాహ్నం రాంబిల్లి పోలీసులు, క్లూస్ టీం సభ్యులు సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రాంబిల్లి సీఐ సిహెచ్.నర్సింగరావు తెలిపారు.

## సింహగిరిపై సామూహిక వరలక్ష్మీ వ్రతాలు రేపు

సింహాచలం: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న సింహగిరిపై పెద్ద ఎత్తున సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహించనున్నట్లు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వ్రతాల్లో పాల్గొనే మహిళలకు పూజాసామగ్రి, అమ్మవారి ప్రతిమ, రవిక, ప్రసాదం దేవస్థానం ఉచితంగా అందిస్తుందన్నారు. కొండ దిగువ నుంచి కొండపైకి, కొండపై నుంచి దిగువకి దేవస్థానం బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం ఉంటుందన్నారు. వ్రతాల అనంతరం స్వామివారి ఉచిత దర్శనం కల్పిస్తామని, మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## నేటి నుంచి మూడో విడత ఐటీఐ కౌన్సెలింగ్

కంచరపాలెం(విశాఖ): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో వివిధ ట్రేడ్‌ల్లో మిగులు సీట్ల భర్తీ కోసం మూడో విడత కౌన్సెలింగ్‌ను గురువారం కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల కన్వీనర్, ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, నరవ ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని కోరారు.

## ముడసర్లోవ పార్కులో సమాధులు!

- 'కూలీ' కోసం సెట్ వేసిన యూనిట్



ముడసర్లోవ పార్కులో సమాధుల సెట్

ఆరిలోవ(విశాఖ): ముడసర్లోవ పార్కు.. శ్మశానంగా మారిపోయింది. పిల్లలు ఆడుకునే మైదానంలో ఎటుచూసినా సమాధులే కనిపిస్తున్నాయి. ఇది అర్థం కాని సందర్శకులు కొందరు ఇది పార్కా..? శ్మశనమా అంటూ అక్కడి సిబ్బందిని బుధవారం నిలదీశారు. దీంతో ఇక్కడ సినిమా షూటింగ్ జరగబోతుందని, ఇందుకోసం సెట్ వేస్తున్నారని సిబ్బంది చెప్పడంతో సందర్శకులు అవునా అంటూ నోరెళ్లబెట్టారు.

తమిళ సినీ సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'కూలీ'సినిమా చిత్రీకరణ ఒకటి, రెండు రోజుల్లో ఇక్కడ జరగనుంది. ఇందుకోసం సినిమా యూనిట్ ఇక్కడ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే పచ్చని చెట్ల మధ్య సమాధులతో కూడిన శ్మశానం సెట్ వేశారు. షూటింగ్‌కు రానున్న రజనీకాంత్ కోసం ఆరిలోవ వాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# స్వచ్ఛంద సంస్థ హాస్టళ్ల తనిఖీ



తామరం ఇమ్మానుయేలు హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

మాకవరపాలెం: ఇమ్మానుయేలు సంస్థ నిర్వహిస్తున్న హాస్టళ్లను ప్రత్యేక కమిటీ సభ్యులు తనిఖీ చేశారు. ఇటీవల కోటవురట్ల మండలం కైలాసపట్నంలో ఫుడ్ పాయిజన్‌తో ముగ్గురు విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న హాస్టళ్లను తనిఖీ చేసేందుకు ఐదుగురి సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఈ మేరకు వారంతా బుధవారం తామరం, కొండల అగ్రహారంలో ఉన్న హాస్టళ్లను పరిశీలించారు. వసతి, భోజన నాణ్యత, వంట గదిలో పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణపై ఆరా తీశారు. వివరాలు నమోదు చేసుకున్నారు. నిబంధనల మేరకు హాస్టళ్ల నిర్వహణ ఉండాలని యాజమాన్యానికి సూచించారు. తనిఖీల్లో గుర్తించిన విషయాలపై జిల్లా రెవెన్యూ అధికారికి నివేదిక అందజేస్తామని డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు తెలిపారు. ఎంఈవో మూర్తి, కమిటీ సభ్యులు ఎస్‌ఐ రామకృష్ణారావు, పీఆర్ జేఈ వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# 14న జాతీయ లోక్ అదాలత్

మహారాణిపేట(విశాఖ): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని అన్ని న్యాయ స్థానాల్లో సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తెలిపారు. న్యాయ స్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కారానికి వస్తాయని పేర్కొన్నారు. వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, విశాఖపట్నంలో లేదా 0891 - 2560414, 2575046 నెంబర్లలో vskpdlsa@yahoo.com, dlsa.vsp@gmail.comలో సంప్రదించాలని కోరారు.

# విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రక్రియ నిలిపేయాలి



మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

- బషీర్‌బాగ్ అమరుల త్యాగాలు వృథా కానివ్వం
- సీపీఎం, సీపీఐ నేతల స్పష్టీకరణ

అనకాపల్లి : రాష్ట్రంలో ఇళ్లకు, వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను ప్రభుత్వం తక్షణం నిలిపివేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి వై.ఎన్.భద్రం డిమాండ్ చేశారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో 2000 ఆగస్టు 28న మరణించిన అమర వీరుల సంస్మరణ సభ స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగింది. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ చలో హైదరాబాద్ కార్యక్రమం జరిగిందన్నారు. బషీర్‌బాగ్‌లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం అతి కిరాతకంగా కాల్పులు జరిపించి రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామిలను బలిగొందని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం మొగ్గు చూపడం దారుణమన్నారు. మొదటి దశలో వ్యవసాయ పంపు సెట్లకు మీటర్ల పేరుతో క్రమంగా ఉచిత విద్యుత్తుకు ఎసరు పెట్టే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు జి.కోటేశ్వరరావు, తాకాసి వెంకటేశ్వరరావు, ఆర్.శంకరరావు, వి.వి. శ్రీనివాసరావు, అల్లు రాజు, జి.నాయనబాబు, కె.ఈశ్వరరావు, డి.డి.వరలక్ష్మి, బి.ఉమామహేశ్వరరావు, కె.సుభాషిణి, బి.నూక అప్పారావు, పి.చలపతి, తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వృద్ధురాలు అదృశ్యం

అనకాపల్లి: స్థానిక చిన్నరాజుపేటకు చెందిన అలంకి నూకరత్నం (60) ఆరోగ్యం బాగులేని కారణంగా వైద్యులు రాసిచ్చిన మందులు వాడుతోంది. అయితే ఆమె ఇటీవల కొన్ని రోజులుగా మందులు వాడటం మానేసింది. ఈ విషయం తెలిసిన కుమారుడు శ్రీను నూకరత్నంపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. మందులు వాడకపోతే తరచూ ఆస్పత్రుల చుట్టూ తిరగ్గలమా? అంటూ ప్రశ్నించాడు. దీంతో అలిగిన నూకరత్నం మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టుపక్కల, బంధువుల ఇంటి వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం పట్టణ పోలీస్‌లకు కుమారుడు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ అలీ ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### పందుల నుంచి పంటలను కాపాడాలి

అనకాపల్లి: మండలంలో గోపాలపురం, అక్కిరెడ్డిపాలెం, మారేడుపూడి, శీరంశెట్టివాని పాలెం గ్రామాల్లో పండించిన కూరగాయలకు పందులు నష్టం కలిగిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది కాలంగా ఇతర ప్రాంతాల నుంచి రాత్రి సమయంలో వ్యాన్లలో పందులను తీసుకొచ్చి గుర్తు తెలియని వ్యక్తులు పొలాల్లో కూరగాయల మధ్య విడిచిపెడుతున్నారని తెలిపారు. దీంతో అవి కూరగాయల పంటలకు నష్టం చేకూరుస్తున్నాయని రైతులు తెలిపారు. ఈ విషయంపై వ్యవసాయశాఖ అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవోకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోలేదన్నారు. తక్షణమే ఈ విషయంపై జిల్లా అధికార యంత్రాంగా చర్యలు తీసుకుని పందుల నుంచి కాపాడా లని రైతులు అప్పారావు, లక్ష్మి, కిరణ్, సత్తిబాబు, సూర్యనారాయణ కోరారు.

### బాధిత కుటుంబానికి రూ.20 వేలు వితరణ



మారేపల్లిలో బాధితులకు నగదును అందజేస్తున్న సత్యవేణి నాయుడమ్మ

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లిలో ఇటీవల మృతి చెందిన అల్లు అప్పారావు కుటుంబానికి జనసేన నాయకులు బాసటగా నిలిచారు. రాయపురెడ్డి కృష్ణ, గొర్రుపోటు రామూర్తినాయుడు తదితర నియోజకవర్గ జనసేన నాయకులు సమకూర్చిన రూ. 20 వేల నగదును మారేపల్లికి చెందిన జనసేన నాయకురాలు అవుగడ్డ సత్యవేణి నాయుడమ్మ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు బుధవారం 114 బెల్లం దిమ్మలు వచ్చాయి

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| మొదటి రకం | 4,200 | 4,800 |
| రెండో రకం | 3,500 | 4,200 |
| మూడోరకం | 3,150 | 3,430 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| పాగల్ V/r కాదల్ | : రాజా(మార్నింగ్, మాట్నీ) |
| త్రిల్లర్ అండ్ చిల్స్ | : రాజా(ఫస్ట్‌షో, సెకండ్‌షో) |
| తంగలాన్ | : సత్యనారాయణ స్క్రీన్-1 |
| కమిటీ కుర్రోళ్లు | : సత్యనారాయణ స్క్రీన్-2 |
| సింబా | : పర్తిసాయి |
| మారుతీనగర్ సుబ్రమణ్యం | : షిర్డీసాయి |
| డబుల్ ఇస్మార్ట్ | : వెంకటేశ్వర |
| మిస్టర్ బచ్చన్ | : శ్రీసత్య |
| 11 డిమోంటి కాలనీ | : రామచంద్ర |

### రక్త నిల్వలు

అనకాపల్లి : ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 38 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-2 యూనిట్లు, బి పాజిటివ్ -15 యూనిట్లు, ఓ పాజిటివ్-20 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్.9703619706)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 443 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 397 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.





### వైద్యులపై దాడులు తగదు

వైద్య సిబ్బంది ప్రశాంత వాతావరణంలో రోగులకు వైద్యం అందిస్తారు. వివిధ రకాలైన వ్యాధులతో ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యం అందించడమే వారి ముఖ్య ఉద్దేశ్యం. అటువంటి వారిపై దాడులు చేసిన వారికి కఠిన శిక్షలు పడాలి. వైద్యులు, సిబ్బంది రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రుల వద్ద పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేస్తే తగిన రక్షణ ఉంటుంది.

– ఒ.జయలక్ష్మి, ఏఎన్ఎం, తుమ్మపాల-2



### ఆలోచనాధోరణి మారాలి

వైద్యులు, వైద్య విభాగంలో సేవ చేసే సిబ్బంది పట్ల చెడుగా ఆలోచించే వారిలో మార్పు రావాలి. శాంతికి చిహ్నం తెలుపు.. తెలుపు రంగు దుస్తులు ధరించి వైద్య సేవలు అందించడం వెనుక గల భావాలు అందరికీ అర్థం కావాలి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి కోసం కుటుంబాలను కూడా వదులుకుని పరుగులు పెట్టే వైద్యులపై ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం అత్యంత దారుణం.

– సీహెచ్ ఆదిలక్ష్మి, ఏఎన్ఎం, శంకరం సచివాలయం



# చదువుల తల్లులు

- ఏజెన్సీ నుంచి వచ్చి కశింకోట ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు
- నాగరికత.. చక్కటి బోధన అలవడతాయని ఆకాంక్ష
- గిరిప్రాంత చిన్నారులు చక్కగా చదువుతున్నారని ఉపాధ్యాయుల కితాబు

కశింకోటలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించడానికి ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు మక్కువ చూపుతున్నారు. పాఠశాలలో ఉన్న విద్యార్థుల్లో సింహభాగం ఏజెన్సీ ప్రాంత విద్యార్థులే. మైదాన ప్రాంత నాగరికత, భాష అలవడతాయని వారు ఆసక్తి చూపుతున్నారు. సమీపంలో వసతి గృహం అందుబాటులో ఉండటంతో పాటు రవాణాకు అనువుగా ఉండటం కూడా ఇందుకు దోహదపడుతోంది.



కశింకోట బాలికల హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు ఏజెన్సీ ప్రాంత బాలికలు

కశింకోట : కశింకోటలోని బాలికల హైస్కూల్లో 730 మంది బాలికలు చదువుతున్నారు. వారిలో సుమారు 400 మంది అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన విద్యార్థులే ఉన్నారు. అరకు, పాడేరు, చింతపల్లి, హుకుంపేట తదితర ఏజెన్సీ ప్రాంతాల బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర విద్యార్థులున్నారు. 3 నుంచి పదవ తరగతి వరకు వీరు ఇక్కడ చదువుతున్నారు. వీరికి తమ సమీపంలో అనేక స్కూళ్లు, వసతి గృహాలు అందుబాటులో ఉన్నప్పటికీ అక్కడ విద్యాభ్యాసం అంతగా బాగుండదని, నాగరికత అలవడదని, మైదాన ప్రాంత భాష ఒంట బట్టదని భావించి దూరం అయినప్పటికీ వచ్చి ఇక్కడ చేరుతున్నారు. ఇక్కడ పక్కనే సమగ్ర బాలికల వసతి గృహం అందుబాటులో ఉంది. దీనిలో సదుపాయాలు బాగుంటాయని వారు చెబుతున్నారు. అలాగే 3,4,5 తరగతుల విద్యార్థుల కోసం బాల సదనం అందుబాటులో ఉంది. దానిలో ఉంటూ ఏజెన్సీకి చెందిన పది మంది వరకు బాలికలు చదువుతున్నారు. కుటుంబానికి దూరంగా ఉంటే బాగా చదువుతారని తల్లిదండ్రులు భావిస్తున్నారు. దీంతో వారు ఇక్కడ తమ పిల్లలను చదివించడం పట్ల ఆసక్తి చూపుతున్నారు. ఇక ఏజెన్సీ ప్రాంత సంస్కృతిని ఇక్కడి విద్యార్థులకు రుచి చూపిస్తున్నారు. ఇటీవల ఏజెన్సీకి చెందిన ధింసా నృత్యాన్ని ప్రదర్శించి తోటి బాలికల్లో ఆసక్తి రేకెత్తించారు. అంతే కాదు జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో ధింసా నృత్యం ప్రదర్శించి అధికారుల ప్రశంసలు పొందారు. ఇలా ఇక్కడ చదివి వేష భాషలు నేర్చుకుంటూ తమ సంస్కృతిని కూడా పరిచయం చేస్తున్నారు.

#### ఏజెన్సీ పిల్లలు బాగా చదువుతున్నారు..

మా పాఠశాలలో ఎక్కువగా ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు వచ్చి చదువుతున్నారు. సుమారు 400 మంది వరకు వాళ్లున్నారు. ప్రధానంగా మైదాన ప్రాంత భాష, సంస్కృతి, నాగరికత అలవర్చుకోవడం కోసం ఇక్కడికి వచ్చి చేరుతున్నారు. వారు చదువు పట్ల బాగానే శ్రద్ధ చూపుతున్నారు.

– ఎం.ఎస్. స్వర్ణకుమారి, హెచ్ఎం, బాలికల హైస్కూలు, కశింకోట.

#### ఇక్కడ చదివితే భవిష్యత్ బాగుంటుంది..



మాది వ్యవసాయ కుటుంబం. మా అమ్మాయిని దూరం అయినప్పటికీ మైదాన ప్రాంత సంస్కృతి, వేష భాషలు, నాగరికత అలవడతాయని, విద్యాభ్యాసం బాగుంటుందని భావించి చదివిస్తున్నాం. మా ప్రాంత పాఠశాలల్లో అయితే ఏజెన్సీ సంస్కృతి మాత్రమే అబ్బుతుంది. ఇక్కడ చేరిస్తే వారి భవిష్యత్ బాగుంటుందని చదివిస్తున్నాం.

– వనగాల సత్యనారాయణ, పేరెంట్, కొండవంచుల, చింతపల్లి మండలం.

#### ఇంటికి దూరంగా ఉంటే బాగా చదువుతారు..



దూరంగా ఉంటే బాగా చదువుకుంటుందని భావించి మా అమ్మాయిని ఇక్కడ చదివిస్తున్నాం. సమీపంలోనే వసతి గృహం ఉంది. రవాణాకు అనువుగా ఉంది. మా ప్రాంతానికి చెందిన వారు కూడా ఇక్కడే చదువుతున్నారు. వారు కూడా తోడుగా ఉంటున్నారు. దాంతో ఎలాంటి భయం లేకుండా ఇక్కడ చదివిస్తున్నాం.

– ఉడా చినతల్లి, పేరెంట్, వనగాల గ్రామం, కొయ్యూరు మండలం

#### విద్యాభ్యాసం బాగుంది..



మైదాన ప్రాంతంలో విద్యాభ్యాసం బాగుంటుందని, మంచి భాష, నాగరికత అలవడతాయని ఇక్కడ చదువుతున్నాం. ప్రస్తుతం నేను 8వ తరగతి చదువుతున్నాను. ఇక్కడ విద్యా బోధన కూడా బాగానే ఉంది. స్కూల్లో చాలా విషయాలు నేర్చుకుంటున్నాను.

– పాంగి జెర్సీ, విద్యార్థి, అరకు

#### ఇక్కడి బడి నచ్చింది..



మా అక్క ఇక్కడే చదివేది. అందుకే నేను ఇక్కడ చేరాను. ఇక్కడ విద్యా బోధన బాగుంటుంది. అందుబాటులో వసతి గృహం ఉంది. సౌకర్యవంతంగా ఉండటం, రవాణాకు అనువుగా ఉండటంతో మా తల్లి దండ్రులు ఇక్కడ మమ్మల్ని చేర్పించారు. ఇక్కడి చదువు, వాతావరణం నచ్చింది.

– కూడ తేజస్విని, విద్యార్థి, చింతపల్లి

### సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి



రిలే దీక్షల్లో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, వసతి గృహ విద్యార్థులు

అనకాపల్లి: రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్రకుమార్ అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మూడు రోజుల రిలే నిరాహార దీక్షల్లో భాగంగా రెండో రోజైన బుధవారం దీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో సర్వే ద్వారా విద్యార్థులు చాలా దయనీయ పరిస్థితుల్లో ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. కొన్ని వసతి గృహాలు వర్షానికి కారిపోతూ విద్యార్థుల ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా ఉన్నాయన్నారు. అటువంటి వాటిని తక్షణం పునర్నిర్మించాలని, అద్దె భవనాల్లో ఉన్న వసతి గృహాల్లో విద్యార్థులకు సరిపడ మరుగుదొడ్లు, గదులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. గిరిజన వసతి గృహాల్లో ఉద్యోగులను సరిపడినంత భర్తీ చేయకపోవడం వల్ల విద్యార్థుల మెస్ చార్జీల నుంచి వర్కర్లకు జీతాలు ఇస్తున్నారని, దీని వల్ల విద్యార్థులకు సరైన భోజనం అందట్లేదని వాపోయారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. అంతకు ముందు ప్రజా ఐక్యవేదిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నయాదవ్ రిలే దీక్షలో పాల్గొన్న వారికి సంఘీబావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి, నాయకులు జగదీష్, సింహాద్రి, సతీష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా ఉట్ల సంబరం



ఉత్సాహంగా వేణుగోపాలస్వామి ఊరేగింపు



ఉట్టి కొడుతున్న యువకులు

కశింకోట: స్థానిక వైష్ణవ శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి ఉట్ల సంబరం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా స్థానిక దేవదాయ శాఖకు చెందిన వేణుగోపాల స్వామి ఆలయం నుంచి రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి విగ్రహాలను గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ సమయంలో ప్రజలు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, మారుతి, రామచరణాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో సంప్రదాయబద్ధంగా యువకులు ఉట్టి కొట్టారు.

## కనకమహాలక్ష్మి ఆలయ గోపురం పనులకు శ్రీకారం



ఆలయ గోపురం పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

యలమంచిలి రూరల్: జిల్లాలో పేరొందిన యలమంచిలి కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ గోపురం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ బుధవారం శ్రీకారం చుట్టారు. రూ.33 లక్షల నిధులతో పట్టణంలోని ధర్మవరంలో కొలువుదీరిన అమ్మవారి ఆలయానికి గోపుర నిర్మాణ పనులు చేపట్టడానికి ఆలయ కమిటీ నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం ఈ పనులకు శంకుస్థాపన చేశారు.

పెద్దాపురానికి చెందిన శిల్పులు గోపురానికి కావాల్సిన దేవతామూర్తుల రూపాలను ఏర్పాటు చేస్తారని, వచ్చే ఏడాది మార్చికల్లా పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ కొఠారు సాంబ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొఠారు కొండబాబు, మాడుగుల సత్యనారాయణ, కొఠారు ప్రకాష్, కొఠారు నరేష్, కొఠారు శ్రీను, ఆవాల నారాయణరావు, తాటిపాకల మాణిక్యాలరావు, తాటిపాకల చిన్ని, ప్రగడ నాగేశ్వర్రావు, తదితరులు పాల్గొన్నారు.

## తీరం పటిష్టతకు చర్యలు తీసుకోవాలి



పూడిమడక ఇసుక తిన్నెలను పరిశీలిస్తున్న మత్స్యకారులు

మునగపాక (అచ్యుతాపురం): అచ్యుతాపురం మండలం పూడిమడక సముద్ర తీర ప్రాంతం కోతకు గురి కాకుండా చూడాలని జిల్లా మత్స్యకార నాయకులు, మాజీ ఉప సర్పంచ్ చోడపల్లి అప్పారావు కోరారు. బుధవారం తీర ప్రాంతాన్ని వైస్ ఎంపీపీ వాసుపల్లి శ్రీనివాసరావు, మైలపల్లి పోలరాజులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ సముద్ర తీర ప్రాంతం కోతకు గురికాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. పూడిమడక మత్స్యకారుల సౌకర్యార్థం జెట్టీ రోడ్డు నిర్మాణాన్ని మార్చు చేసి అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## శంకరం పంచాయతీలో భూ ఆడిట్‌కు డిమాండ్

మాడుగుల: మండలంలోని శంకరం పంచాయతీలో భూ ఆడిట్ నిర్వహించాలని, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పి.ఎస్.అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మాడుగుల మండలం శంకరం పంచాయతీలో పర్యటించిన ఆయన ఆదివాసీలను కలుసుకుని మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలో అత్యధిక శాతం బంజరు భూములు, సీలింగ్ భూములుండగా శంకరంలో కూడా ఉన్నాయని గుర్తు చేశారు. ఈ అవాస గ్రామాలన్నీ ఆదివాసీ రైతులతో నిండి ఉన్నాయన్నారు. కానీ నేడు ఈ భూములు జిల్లాయేతర రైతుల సాగులోకి వెళ్లిపోతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని చెబుతుందని, ఈ సభల్లో సర్వే చేసి అర్హులైన వారికి భూములు ఇప్పించాలని డిమాండ్ చేశారు. పెద్దేరు నిర్వాసితులకు కూడా భూములు ఇప్పించాలని అన్నారు.

### శంకరంలో సోలార్ దీపాల పంపిణీ



శంకరం గ్రామంలో సోలార్ దీపాలు అందజేస్తున్న పరమేశ్వరరావు తదితరులు

మాడుగుల రూరల్: గిరిజన పంచాయతీ అయిన శంకరం గ్రామంలో బుధవారం సోలార్ దీపాలు పంపిణీ చేశారు. సౌత్ ఏసియా ఎల్‌పీజీ కంపెనీ ఆధ్వర్యంలో, కంపె నీ ప్రతినిధి రామ్‌నాథ్ ఆధ్వర్యంలో 1500 మందికి జిల్లా బీజేపీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరమేశ్వరావు మాట్లాడు తూ గ్రీన్ ఎనర్జీ కార్యక్రమంలో భాగంగా సోలార్ దీపాలు పంపిణీ చేసినట్టు తెలిపారు.విద్యుత్, బ్యాటరీ అవసరం లేకుండా కేవలం సోలార్‌తోనే వెలుతురు అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోలం రమేశ్, పార్టీ సీనియర్ నాయకుడు, మాడుగుల మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, మండల పార్టీ అధ్యక్షుడు ఉందూరు రాజు, పార్టీ ప్రధాన కార్యదర్శి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

మునగపాక: వాడ్రాపల్లిలో బుధవారం నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించింది. పెతకంశెట్టి జోగినాయుడు గ్రంథాలయం వార్షికోత్సవంలో భాగంగా వాలీబాల్, క్యారమ్స్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు గురువారం రాత్రి బహుమతులు అందజేస్తామని గ్రంథాలయ గౌరవాధ్యక్షుడు పెతకంశెట్టి రామజోగినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బొడ్డేడ సత్యనారాయణ, కొయిలాడ దశావతారం, మళ్ల వరహా నరసింగరావు, కమిటీ అధ్యక్షులు మళ్ల జోగినాయుడు, మళ్ల కన్నం నాయుడు, రవి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్



గర్భిణులను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు రక్తహీనత సమస్యను అధిగమించవచ్చునని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. ఆర్.వై.అగ్రహారం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా 137 మందికి ఆరోగ్య పరీక్షలను నిర్వహించి మందులు ఇచ్చారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు జరిపి జాగ్రత్తలను వివరించారు. గర్భిణులు, కిశోర బాలికలు పప్పు దినుసులు, ఆకుకూరలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవించం శ్రేయస్కరమని వైద్యాధికారిణి శైలజ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు, ఎంఎల్‌హెచ్‌పీ మంగవేణి, ఏఎన్ఎం.రాము, హెల్త్ అసిస్టెంట్ ఆర్.గంగాధర్‌రావు పాల్గొన్నారు.

## ఘనంగా ఆవిర్భావ వేడుకలు



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీరుయాదవ్ తదితరులు

అనకాపల్లి : మందకృష్ణ మాదిగ స్థాపించిన వికలాంగుల హక్కుల పోరాట సమితి 18వ ఆవిర్భావ వేడుకలు బుధవారం స్థానిక ఉడ్‌పేట సమితి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సమితి జిల్లా కార్యదర్శి పాత్రుపల్లి వీరుయాదవ్ హక్కుల పోరాట పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2007లో మందకృష్ణ మాదిగ వికలాంగుల హక్కుల పోరాట సమితిని స్థాపించారన్నారు. ప్రభుత్వం వికలాంగులకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమితి జిల్లా సభ్యులు కరెట్ల కోటేశ్వరరావు, ఆడారి తులసి అప్పికొండ, శివ, మాలపల్లి గణేష్, కరణం శివ, భానోద్ దిలీప్, మల్ల వెంకట్ కాండ్రేగుల నూకఅప్పారావు, చెట్టుపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి రూ.9 లక్షల సాయం



మృతుడు కృష్ణ భార్యకు నగదు, చెక్కును అందిస్తున్న దృశ్యం

కె.కోటపాడు: మండలంలో సూర్రెడ్డిపాలెం గ్రామానికి చెందిన కింతాడ కృష్ణ (48) లారీ ఢీకొని విశాఖపట్నంలో ఈ నెల 26న మృతి చెందాడు. మృతుడు కృష్ణ విశాఖపట్నం శ్రావణి షిప్పింగ్ కంపెనీలో లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. గత సోమవారం రాత్రి కె.ఆర్.సన్స్‌కు చెందిన లారీ ఢీకొట్టడంతో ఆయన మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చెయ్యాలని ఆయుష్మాన్ ఆస్పత్రి వద్ద సీఐటీయూ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. దీంతో బాధిత కుటుంబానికి శ్రావణి షిప్పింగ్ యాజమాన్యం రూ.9 లక్షలు అందించేందుకు ముందుకు వచ్చిందని సీఐటీయూ అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము తెలిపారు. మృతుడి భార్య పాపయ్యమ్మకు రూ.5 లక్షల నగదు, మిగిలిన నగదుకు సంబంధించిన బ్యాంక్ చెక్కును బుధవారం అందించిందన్నారు. అలాగే ప్రమాదానికి కారణమైన లారీ నుంచి బీమా పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని కంపెనీ నిర్వాహకులు హామీ ఇచ్చినట్టు రాము తెలిపారు. సూరెడ్డిపాలెంలో కృష్ణ మృతదేహానికి బుధవారం అంత్యక్రియలు జరిపారు. విశాఖపట్నం సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, మరదాన రవి, బుజ్జి, సతీష్, సన్యాసిరావు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

చీడికాడ : ఎయిడ్స్ నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌ను పూర్తిగా పారదోలవచ్చునని, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో బుధవారం చీడికాడలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సంస్థ సీఎల్‌డబ్ల్యు పి.సూర్యకళ పేర్కొన్నారు. చీడికాడ హైస్కూల్లో విద్యార్థినులకు హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్‌ఐవీ రోగుల పట్ల వివక్ష తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన కలిగించి తద్వారా ఎక్కువ మందిని హెచ్‌ఐవీ పరీక్షలు చేయించుకోనేలా చైతన్య పరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సింహాచలం, ఆశ కార్యకర్త చిన్నమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా మంచాల, చీడికాడ గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.